నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
18 డిసెంబర్ 2024
పేజీలు 8

## చిల్లపల్లి పంచాయతీకి అవార్డ్

కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ దేశ వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలను ప్రకటించింది. అందులో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామ పంచాయతీకి రెండో ర్యాంక్ దక్కింది. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ 9 అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ పురస్కారాలను ప్రకటిస్తుంది.

## అంతర్జాతీయం

**యునెస్కో**

- తమిళనాడులోని అబతసహాయేశ్వర్ దేవాలయ పరిరక్షణ ప్రాజెక్ట్, మహారాష్ట్రలోని బాయ్‌రామ్‌జీ జీజీబోయ్ పార్సి చారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్ (బీజేపీసీఐ) పరిరక్షణ ప్రాజెక్ట్‌లను యునెస్కో గుర్తించింది. డిస్టింక్షన్ విభాగంలో అబతసహాయేశ్వర్ దేవాలయం, దేవాలయ సంరక్షణ విభాగంలో బీజేపీసీఐని చేర్చింది.



**యూఎన్‌జీఏ**

- గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ జరగాలంటూ ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ మద్దతు పలికింది. మొత్తం 157 దేశాలు ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. బేషరతుగా ఈ కాల్పుల విరమణ కొనసాగాలని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. అలాగే ఏటా డిసెంబర్ 21ను అంతర్జాతీయ ధ్యాన రోజుగా యూఎన్‌జీఏ ప్రకటించింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది.

**యూఎన్ఈపీ**

- 2022తో పోలిస్తే 2023లో హరిత వాయు ఉద్గారాలు విపరీతంగా పెరిగాయని ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం పేర్కొంది. 1.3% పెరుగుదల ఉందని వెల్లడించింది. 57.1 బిలియన్ టన్నులు అధికంగా ఉద్గారాలు నమోదయ్యాయని వెల్లడించింది.

**యూఎన్‌సీసీడీ**

- 1990 నుంచి 2020 మధ్య శాశ్వతంగా దాదాపు 78% భూమి ఎడారిగా మారిందని యూఎన్‌సీసీడీ తాజా నివేదికలో పేర్కొంది. ఏడారీకరణ జరగకుండా ఉండేందుకు ఉద్దేశించిన ఒప్పందాన్నే యూఎన్‌సీసీడీ అని పిలుస్తారు. దీని పూర్తి రూపం- యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డెసర్టిఫికేషన్.

**భూటాన్**

- పునత్‌సంగ్చు జల విద్యుత్ ప్రాజెక్ట్‌తో పాటు మైండ్‌ఫుల్‌నెస్ నగర నిర్మాణం, వివిధ రైలు ప్రాజెక్టులకు సంబంధించి భారత్, భూటాన్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఆ దేశ రాజు జిగ్మే కేసర్ నామ్‌గ్యేల్ వాంగ్‌చుక్ భారత్‌ను సందర్శించారు. ప్రధాని మోదీతో సమావేశం అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

**యూఏఈ**




- ప్రపంచంలో అతిపెద్ద గోల్డ్ బార్‌ను యూఏఈలో తయారు చేశారు. ఇది గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించింది. దీని విలువ సుమారు రూ. 211 కోట్లు.

**సిరియా**

- సిరియా అధ్యక్షుడు అసద్ శకం ముగిసింది. ఆయనను వ్యతిరేకిస్తున్న రెబల్స్ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. 54 సంవత్సరాలుగా అసద్ కుటుంబానికే పరిమితమైన అధికారం చేజారింది.

## జాతీయం



**రతపాని వన్యప్రాణి సంరక్షణ కేంద్రం**

- దేశంలో 57వ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా రతపాని వన్యప్రాణి కేంద్రాన్ని ప్రకటించారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది. అలాగే 58వ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా మాధవ్ జాతీయ పార్క్‌ను ప్రకటించారు. ఇది కూడా మధ్యప్రదేశ్‌లోనే ఉంది.

**గీతా పారాయణం**

- గీతా జయంతి రోజున భోపాల్, కురుక్షేత్ర రికార్డ్‌ను సృష్టించాయి. భోపాల్‌లో 5000కు పైగా ఆచార్యులు గీతా పారాయణం చేయడం ఒక రికార్డ్ అయితే, కురుక్షేత్రలో 1.5 కోట్ల మంది వర్చువల్ పద్ధతిలో గీతా పారాయణం చేశారు. ఇది కూడా ఒక రికార్డ్.

**అణుశక్తి రెట్టింపు**

- 2014తో పోలిస్తే దేశంలో అణుశక్తి రెట్టింపయ్యిందని కేంద్రం పార్లమెంట్‌లో ప్రకటించింది. 2014లో అణుశక్తి ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ 4780 మెగావాట్లు ఉంటే 2024 నాటికి 8180 మెగావాట్లకు చేరింది. 2031-32 నాటికి ఈ శక్తి 22,480 మెగావాట్లకు చేరడమే లక్ష్యం.

**జన్ ఔషధీ కేంద్రాలు**

- ప్రధాన మంత్రి భారత్ జన్ ఔషధీ కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు నిర్వహించనున్నాయి. జనరిక్ ఔషధాలను తక్కువ ధరలో అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించింది ఇది.

## వార్తల్లో వ్యక్తులు

**మాధవ్ గాడ్గిల్**

- ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్‌ను ప్రముఖ జీవావరణ వేత్త మాధవ్ గాడ్గిల్‌కు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. పర్యావరణం, జీవావరణ పరిరక్షణకు ఆయన కృషి చేశారు. పశ్చిమ కనుమల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం ఏర్పాటు చేసిన కమిషన్‌కు ఆయన నేతృత్వం వహించారు.

**సంజయ్ మల్హోత్ర**

- భారత రిజర్వ్ బ్యాంక్‌కు 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్ర నియమితులయ్యారు. ఆయన 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. శక్తికాంత దాస్ పదవీ కాలం డిసెంబర్ 10న ముగిసింది. దీంతో సంజయ్ మల్హోత్రాను నియమించారు.



**భారతి కొల్లి**

- 2024లో 'రైజింగ్ స్టార్ ఉమెన్ లీడర్స్ బ్యాంకింగ్'గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భారతి కొల్లి నిలిచారు. విజయనగరం జిల్లాకు చెందిన ఆమె న్యూయార్క్‌లోని ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనాలో విధులు నిర్వహిస్తున్నారు. అమెరికాలోని ఉమెన్ హ్యూ అడ్మైర్ అనే సంస్థ ఈ అవార్డ్‌కు ఆమెను ఎంపిక చేసింది.

**డొనాల్డ్ ట్రంప్**

- టైమ్స్ 2024 పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా డొనాల్డ్ ట్రంప్ ఎంపికయ్యారు. అమెరికాలో నవంబర్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఆ దేశ 47వ అధ్యక్షుడిగా జనవరిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

**దేవజిత్ సైకియా**

- బీసీసీఐ యాక్టింగ్ సెక్రటరీగా అసోం రాష్ట్రానికి చెందిన మాజీ క్రికెటర్ దేవజిత్ సైకియా ఎంపికయ్యారు. జై షా స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. జై షా ఐసీసీ చైర్మన్‌గా ఎంపికయ్యారు.

**వెరోనికా బాచిలెట్**

- చిలీ మాజీ అధ్యక్షుడు వెరోనికా మిషెల్లి బాచిలెట్ జెరియాకు 2024 సంవత్సరానికి ఇందిరాగాంధీ ప్రైజ్ ఫర్ పీస్, డిజార్మమెంట్ అండ్ డెవలప్‌మెంట్ అవార్డ్ దక్కింది.

**ఎస్ఎం కృష్ణ**

- కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ మరణించారు. ఆయన గతంలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా కూడా విధులు నిర్వహించారు. కర్ణాటకలో ఐటీ రంగ అభివృద్ధికి పునాది వేసింది ఆయనే.

## తెలంగాణ

**హైదరాబాద్ బిర్యానీ**

- ప్రపంచంలో టాప్ 100 అత్యుత్తమ వంటకాల్లో హైదరాబాద్ బిర్యానీకి చోటు దక్కింది. 31వ స్థానంలో నిలిచింది. ప్రముఖ గ్లోబల్ ట్రావెల్ అండ్ ఫుడ్ గైడ్ అయిన టేస్ట్ అట్లాస్ ఈ జాబితాను రూపొందించింది.



**ఉద్యాన పంటల పరిశోధన**

- ఉద్యాన పంటల అభివృద్ధి, పరిశోషధన, శిక్షణలో సహకారాన్ని పెంపొందించడానికి తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, సీడాక్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

**అవశేషాలు గుర్తించే పరికరం**

- కూరగాయలు, పళ్లలో క్రిమి సంహారక అవశేషాలను సూక్ష్మ స్థాయిలో గుర్తించేందుకు బిట్స్ హైదరాబాద్ పరిశోధకులు ఒక కొత్త పరికరాన్ని రూపొందించారు. దీని ద్వారా కూరగాయలు, పళ్లలో అర్గానోఫాస్ఫేట్ అవశేషాలను గుర్తించవచ్చని హైదరాబాద్ మైక్రో ఫ్లూయిడ్స్, నానో ఎలక్ట్రానిక్స్ ప్రయోగశాల పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరికరానికి మైక్రోఫ్లూయిడ్ చిప్‌ను అమర్చారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక పరిజ్ఞానంతో ఇది పనిచేస్తుంది.

**పాఠ్య పుస్తకాల్లో జయ జయహే తెలంగాణ**

- తెలంగాణ ప్రభుత్వం ప్రచురించే పాఠ్య పుస్తకాల్లో ఈసారి రాష్ట్ర గేయాన్ని, తెలంగాణ తల్లి చిత్ర పటాన్ని ముద్రించాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది.

**సైబర్ దాడుల గుర్తింపులో అగ్రస్థానం**

- దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైబర్ దాడులను గుర్తించడంలో తెలంగాణ సత్తా చాటింది. నేరగాళ్లు పంపిన వాటిలో 15.03% మాల్‌వేర్స్‌ను గుర్తించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్ ఉన్నాయి.

**ఉద్యమకారులకు సాయం**

- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన 9 మంది ప్రముఖ రచయితలు, కవులకు ప్రభుత్వం రూ. కోటి నగదుతో పాటు ఫ్యూచర్ సిటీలో ఇంటి స్థలం ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిరావు కుటుంబాలకు ఈ సాయాన్ని అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏఎంబీఐఎస్ (అంబిస్)**

- నేరస్తులను అరెస్ట్ చేసిన వెంటనే వేలి ముద్రలతో పాటు అరచేతులను స్కానింగ్ చేసి భద్ర పరిచే విధానం స్థానంలోనే కొత్త పద్ధతి వచ్చింది. ముఖం, కళ్లతో పాటు అరికాళ్లను స్కాన్ చేయనున్నారు. ఇందుకు కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ది ఆటోమేటెడ్ బయో మెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (అంబిస్)ను వినియోగించనున్నారు. దేశంలో ఈ తరహా సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిన తొలి రాష్ట్రం తెలంగాణ.

**బ్రెయిన్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్**

- శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటు చేసిన 'బ్రెయిన్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్'ను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు డిసెంబర్ 11న ప్రారంభించారు. ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్‌నే బ్రెయిన్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్‌గా పేర్కొంటారు. ఇది కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలను వినియోగించి విమానాశ్రయ కార్యకలాపాలను క్రమబద్ధీకరిస్తుంది. సేవల్లో అంతరాయాలను నిరోధిస్తుంది.



**పత్తి పరిశోధన కేంద్రం**

- రాష్ట్రంలో తొలి పత్తి పరిశోధన కేంద్రం ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు భారత వ్యవసాయ పరిశోధన సంస్థ ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ ప్రాజెక్ట్ ఆన్ కాటన్'ని మంజూరు చేసింది. 2025 నుంచి ఈ కేంద్రం కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

## రోజులు-ప్రాధాన్యం

**డిసెంబర్ 11**

- అంతర్జాతీయ పర్వత రోజును ఏటా డిసెంబర్ 11న నిర్వహిస్తారు. పర్వతాల ప్రాధాన్యం, జీవ వైవిధ్యం కాపాడటంలో పర్వతాల పాత్ర గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన రోజు ఇది.

**డిసెంబర్ 10**

- ఏటా డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల రోజుగా నిర్వహిస్తారు. 1948 డిసెంబర్ 10న మానవ హక్కులను గుర్తిస్తూ ఐక్యరాజ్య సమితిలో తీర్మానాన్ని ఆమోదించారు. దీంతో ఈ రోజును ఎంపిక చేశారు.

**డిసెంబర్ 9**

- ఏటా డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి నిరోధక రోజుతో పాటు మారణ హోమానికి గురైన బాధితుల స్మారకపు రోజుగా కూడా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 7**

- ఏటా డిసెంబర్ 7న ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే గా నిర్వహిస్తారు. శాంతి భద్రతలు, సరిహద్దు వద్ద పహారాను కాపాడటంలో సైనిక బలగాలు చూపుతున్న చొరవకు సంబంధించి ఈ రోజును ఎంపిక చేశారు. అలాగే ఇదే రోజును ప్రతి సంవత్సరం అంతర్జాతీయ పౌర విమానయాన రోజుగా కూడా నిర్వహిస్తారు.

## క్రీడలు

**గుకేశ్ ప్రపంచ రికార్డ్**

- భారత చదరంగ ఆటగాడు గుకేశ్ అతి చిన్న వయసులో చెస్ చాంపియన్‌గా నిలిచాడు. 18వ ఏటనే ఈ ఘనతను దక్కించుకున్నాడు. గతంలో ఈ రికార్డ్ కాస్పరోవ్ పేరిట ఉంది. తన 22వ ఏట కాస్పరోవ్ చెస్ విజేతగా నిలిచాడు. గుకేశ్ ఆ రికార్డ్‌ను అధిగమించాడు. భారత్ నుంచి చెస్ చాంపియన్‌గా నిలిచిన రెండో వ్యక్తి గుకేశ్. మొదట ఈ ఘనతను విశ్వనాథన్ ఆనంద్ సాధించాడు.



**ఫిఫా పురుషుల ప్రపంచ కప్**

- 2034లో పురుషుల ప్రపంచ ఫుట్‌బాల్ కప్ సౌదీ అరేబియాలో నిర్వహించనున్నారు. మధ్య ప్రాచ్యంలో ఈ టోర్నీని నిర్వహించనున్న రెండో దేశం సౌదీ అరేబియానే. గతంలో ఖతార్ ఈ టోర్నీని నిర్వహించింది. 2030లో ఈ పోటీలను మొరాకో, పోర్చుగల్, స్పెయిన్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి.

**ఆసియా కప్ క్రికెట్**

- ఆసియా కప్ క్రికెట్ అండర్-19 విభాగంలో బంగ్లాదేశ్ విజయం సాధించింది. తుదిపోరులో బంగ్లాదేశ్ భారత్‌ను ఓడించింది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

